

భావనారాయణుడికి వెండి ఆభరణాలు
దుర్గాడ శివాలయంలో అభిషేకాలు
శృంగారవల్లభ ఆలయానికి భక్తుల తాకిడి
వేట కుక్క దాడిలో కణుజు మృతి 7లో

'పొత్తు'తో చిత్తే!



- టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి పొత్తుతో జిల్లా వైసీపీలో వణుకు
- ఇక ఎన్నికల్లో తమ పని అయిపోయినట్లేనని ఆ పార్టీ నేతల కలవరం
- ఒకపక్క తీవ్ర ప్రజా వ్యతిరేకత, మరోపక్క బలమైన కూటమితో ఏం పాలుపోని పరిస్థితి
- 2014 అసెంబ్లీ ఎన్నికలనాటి ఫలితాలు పునరావృతమవుతాయనే లెక్కలతో గుబులు
- ఇప్పటికే జిల్లాలో ఎక్కడికక్కడ నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన కూటమి జోరు
- జిల్లా నుంచే పవన్ పోటీ చేయనుండడంతో మొత్తం తుడిచిపెట్టేస్తుందని కలవరం
- పుష్కలంగా డబ్బు, మద్యాన్ని నమ్ముకున్నా గెలిచే పరిస్థితి లేదన్న అంచనాలతో కుదేలు
- జనసేన, బీజేపీ కలవడంతో విజయదుంధుబి ఖాయమని టీడీపీలో ధీమా

అసెంబ్లీ ఎన్నికల గంట మోగకుండానే జిల్లాలో అధికార వైసీపీలో అప్పుడే వణుకు మొదలైంది. పోటీకి ముందే ఓటమి భయంతో విలవిల్లాడుతోంది. రాబోయే ఎన్నికల్లో డబ్బు, మద్యం ఎర, అడ్డగోలు అధికార దుర్వినియోగంతో ఏదోలా గెలవచ్చని ఇంతకాలం ధీమాగా ఉన్నా.. తాజాగా టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య పొత్తు అధికారికంగా ఖరారవడంతో ఉలిక్కిపడుతోంది. ఈ బలమైన కూటమి ముందు ఎన్నికల్లో నిలబడలేమని ఆందోళన చెందుతోంది.

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఒకపక్క తీవ్ర ప్రజావ్యతిరేకత, మరోపక్క మూడు పార్టీలు కలిసి వస్తుండడంతో ఎన్నికల్లో ఫ్యాన్ చిత్తయిపోవడం ఖాయమనే లెక్కలతో ఆ పార్టీ నేతలు బెంబేలెత్తుతున్నారు. 2104 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీలు కలవడంతో అప్పట్లో వైసీపీ చిత్తుచిత్తైపోయిందన్న లెక్కలు గుర్తు చేసుకుని జిల్లాలో ఆ పార్టీ నేతలు ఉలిక్కిపడుతున్నారు. ఇప్పుడు అవే ఫలితాలు పునరావృతమవుతాయనే అంచనాలతో గుబులు చెందుతున్నారు. మరోపక్క ఈసారి ఎన్నికల్లో కాకినాడ ఎంపీ లేదా ఎమ్మెల్యేగా పవన్ పోటీ చేస్తారంటూ బలంగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బలమైన టీడీపీకి పవన్ బలం తోడవుతుండడంతో జిల్లాలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అన్ని స్థానాల్లో క్లీన్ స్వీప్ చేసేస్తుందనే విశ్లేషణలు వైసీపీకి కునుకు పట్టనీయడం లేదు. దీంతో నియోజకవర్గాల్లో బరిలో ఉన్న వైసీపీ ఇన్‌ఛార్జులకు తమ రాజకీయ భవిష్యత్తు కళ్లముందే కనిపిస్తుండడంతో దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు.

వణుకే వణుకు..

వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచీ అరాచకమే హద్దుగా పాలన సాగించింది. ఆ పార్టీ ఎమ్మెల్యేలు జిల్లాలో ఎక్కడికక్కడ అందినకాడికి అడ్డంగా దోచేశారు. పోలవరం మట్టి, పేదల ఇళ్లస్థలాల కొనుగోలు, లేఅవుట్ల చదును వరకు కోట్లలో కొట్టేశారు. దీనికితోడు జగన్ ప్రభుత్వం ప్రజలకు ఈ ఐదేళ్లలో ప్రత్యక్ష నరకం చూపించింది. పన్నుల బాదుడు, రహదారుల గుంతలు, విద్యుత్ ఛార్జీల బాదుడు, ప్రశ్నిస్తే కేసులు.. ఒకటేంటి నియంతృత్వ పాలనతో ప్రజలకు కంటిపైకునుకు లేకుండా చేసింది. ఈ నేపథ్యంలో రాబోయే ఎన్నికల్లో వైసీపీ పనిఅయిపోతుందనే అంచనాలు నెలకొన్నాయి. విపరీతంగా ప్రజల్లో పేరుకుపోయిన వ్యతిరేకతతో ఆ పార్టీ ఓటమి ఖాయమన్న విశ్లేషణలు నెలకొన్నాయి. ఎంత వ్యతిరేకత ఉన్నా వలంటీర్లను అడ్డం పెట్టుకుని ఓటర్లను బెదిరించడం, కోట్లలో డబ్బును కుమ్మరించడం, తమకు మాత్రమే అందుబాటులో ఉన్న కోట్ల డబ్బుతో ఓటర్లను కొనేసి ఏదోలా గట్టెక్కేద్దామని ఇంతకాలం ధీమాగా ఉంది. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా నియోజకవర్గాల్లో ఎన్నికల అక్రమాలకు తెర లేపింది. ఇప్పుడు వైసీపీ ప్రణాళికలు పటాపంచలవుతున్నాయి. ఏదోలా గెలిచేస్తామనే అంచనాలు ఆవిర వుతున్నాయి.

వైసీపీకి ఈసారి మళ్లీ అంతేనా..

2014 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి ఎన్నికల్లో పోటీ చేశాయి. అప్పట్లో ఈ మూడు పార్టీల ముందు వైసీపీ చిత్తుచిత్తయింది. దీంతో ఇప్పుడు మళ్లీ ఆ పాత కలయిక చిగురించడంతో తమ పనిఅయిపోయిందని వైసీపీ నేతలు బెంగపడుతున్నారు. పైగా ఈసారి ప్రజా వ్యతిరేకత మామూలుగా లేదనే విషయం అర్థమై నియోజకవర్గాల్లో పలువురు వైసీపీ ఇన్‌ఛార్జులకు అప్పుడే ఓటమి భయం పట్టుకుంది. దీనికితోడు ఇప్పటికే టీడీపీ, జనసేన పొత్తుతో కాకినాడ జిల్లాలో వైసీపీకి గట్టి దెబ్బ తగలడం ఖాయం అనే విశ్లేషణలు కొనసాగుతున్నాయి. ఈ రెండు పార్టీలు కలవడంతో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలకుండా ఫ్యాన్‌ను దెబ్బకొట్టేస్తుందని ఆ పార్టీ నేతలు కొంతకాలంగా తలపట్టుకున్నారు. దీనికి అదనంగా ఇప్పుడు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కాకినాడ జిల్లా నుంచే ఎంపీ లేదా ఎమ్మెల్యేగా బరిలోకి దిగడం ఖాయమని తేలిపోయింది. ఈ నేపథ్యంలో ఆయన ప్రభావం కాకినాడ జిల్లాతోపాటు ఉమ్మడి జిల్లా పైనా బలంగా ఉండనుంది. తద్వారా వైసీపీకి వ్యతిరేక గాలి ఫ్యాన్ ముక్కలయ్యే స్థాయిలో ఉంటుందని వైసీపీలోను బలంగా ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 19స్థానాలకుగాను టీడీపీ కూటమి ఏకంగా 13 సీట్లు కైవసం చేసుకుంది. వైసీపీ కేవలం ఐదు సీట్లకే పరిమితమైంది. కాకినాడ జిల్లా వరకు చూసుకుంటే కేవలం మూడుస్థానాల్లో అతి కష్టంపై గెలిచింది. ఇప్పుడు 2014 నాటి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తిరిగి జత కట్టడంతో అప్పట్లో వైసీపీకి వచ్చిన సీట్లు కూడా ఈసారి రావని సొంత పార్టీలోనే చర్చ జరుగుతోంది. తమతో తాజాగా బీజేపీ కూడా కలవడంతో టీడీపీ, జనసేన పార్టీల్లో మరింత జోష్ పెరిగింది. ఇరు పార్టీలు కలిసి జగన్‌ను ఎదుర్కొని గెలుస్తామని ఇంతకాలం ధీమాగా ఉన్నా, అధికార పార్టీ అరాచకాలు, అక్రమాలను నిలువరించే విషయంతో కొంత భయం కొనసాగింది. కానీ ఇప్పుడు బీజేపీతో పొత్తు ఖాయమైపోవడంతో తిరుగులేని స్థాయిలో వైసీపీని గోదాట్లో ముంచేయడం ఖాయమనే ధీమాలో ఉన్నాయి.

బీజేపీ కలయికతో..

ఎన్నికల క్షేత్రంలోకి టీడీపీ, జనసేన కలిసి వెళ్లాలని ఇప్పటికే నిర్ణయించగా తాజాగా కేంద్రంలో బలంగా ఉన్న బీజేపీ కూడా ఈ రెండు పార్టీలతో పొత్తు అధికారికం గా ఖరారు చేసుకోవడంతో ఇప్పుడు వైసీపీకి నిద్రపట్టడం లేదు. ఈమూడు పార్టీల కలయికతో ఎన్నికల్లో తాము చిత్తవడం ఖాయమని జిల్లాలో వైసీపీ నేతలు అప్పుడే విశ్లేషించుకుంటున్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి పొత్తు కుదిరినా అధికారం చేతిలో ఉండడంతో డబ్బు, మద్యం యథేచ్ఛగా పంచవచ్చని, దొంగ ఓట్ల బలం ఎలాగో కాస్తుందని ఇంతకాలం వైసీపీ ధీమాగా ఉంది. కానీ ఇప్పుడు బీజేపీ కలవడంతో ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడడం అంత సులువు కాదని భావిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఒక్క సీటైనా గెలవడం కష్టమని ఆ పార్టీ నేతలు లెక్కలు వేస్తున్నారు.

తెలుగు భాషను.. భావితరాలకు చేర్చాలి



తెలుగు మహాసభల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, శాసనసభ మాజీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, వంగూరి ఫౌండేషన్ అధ్యక్షుడు వంగూరి చిట్టెన్‌రాజు

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- కాకినాడలో అఖిల భారత తెలుగు సాహితీ సదస్సు ప్రారంభం
- దేశ, విదేశాలనుంచి సాహితీవేత్తల హాజరు

7లో

అఖిల భారత సాహితీ సదస్సులో ప్రముఖుల అభిప్రాయాలు

పోర్టుసిటీ(కాకినాడ), మార్చి 9: అఖిల భారత సాహితీ సదస్సులో పలువురు సాహితీవేత్తలు తెలుగు భాషాభివృద్ధిపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

● సినిమా ద్వారా భాషాభివృద్ధికి కృషి చేస్తా

-మీర్‌అబ్దుల్లా, పడమటి సంధ్యారాగం సినిమా సహ నిర్మాత, నటులు



సినీ రంగం ద్వారా తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తాను. భాషాభిమానంతో త్వరలో తీయబోయే పడమటి సంధ్యా రాగం-2 సినిమాలో అచ్చ తెలుగుభాష వాడతాను.

● నృత్యం ద్వారా అవగాహన

-రాజారమాపద్మజ, నృత్య శిక్షకురాలు, ఖతార్



తెలుగు భాషపై ఉన్న అభిమానాన్ని అందరికీ పంచేందుకు కృషి చేస్తున్నాను. ఖతార్‌లో 25ఏళ్లుగా నివాసముంటున్నాను. కుచిపూడి నృత్యంద్వారా పిల్లలకు తెలుగు సాహిత్యంపై అవగాహన కల్పిస్తున్నా.

● ఘంటసాల పాటలు అమోఘం

-డాక్టర్ వంశీరామరాజు



ఘంటసాల పాడిన పాటల్లో తెలుగుదనం ఉట్టిపడుతుంది. భాషా, సాహిత్యంలో ఆయనకు ఆయనే సాటి. వంశీ బర్కిలీ అవార్డుల ద్వారా తెలుగుభాషా అభ్యున్నతికి కృషిచేస్తున్నాను.

● లలిత గీతాల ద్వారా భాషాభివృద్ధి

-డాక్టర్ వద్దేపల్లి కృష్ణ, పాటల రచయిత, దర్శకులు



లలిత గీతాల ద్వారా తెలుగు భాషా వ్యాప్తికి కృషి చేస్తున్నాను. 1995వ దశకంలో నేను రేడియో ద్వారా పాడిన పాట తెలుగు భాషాభిమానులను ఎంతగానో ఆకట్టుకుంది.

వైభవంగా రథోత్సవం

- సామర్లకోటలో భీమేశ్వరుని రథోత్సవం
- కుక్కుటేశ్వరస్వామి రథోత్సవం

7లో



పిఠాపురం పాదగయలో స్వామివారి రథోత్సవం

సముద్రంలో పైప్‌లైన్ తొలగించే వరకు ఆందోళన విరమించేదిలేదు

- కొత్తపల్లి మండలం కోనపాపపేటలో నాలుగోరోజుకు చేరిన మత్స్యకారుల నిరసన

కోనపాపపేట(కొత్తపల్లి), మార్చి 9: లైఫిజ్ ఫార్మా కంపెనీ వ్యర్థ జలాలు విడుదల చేసేందుకు సముద్రంలో మూడు కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌ను తొలగించేవరకు ఆందోళన విరమించేదిలేదని కొత్తపల్లి మండలం పొన్నాడ శివారు కోనపాపపేట మత్స్యకారులు స్పష్టం చేశారు.పైప్‌లైన్ తొలగించాలని మత్స్యకారులు నాలుగురోజులుగా ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. కొత్తపల్లి మండలం కోనపాపేట మూడు రోడ్ల సెంటర్‌లో శనివారం మత్స్యకార కుటుంబాలు బైఠాయించి నిరసన తెలియజేశాయి. కాకినాడ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి వంగా గీతావిశ్వనాథ్ పైప్‌లైన్ తొలగించాలని ఆందోళన చేస్తున్న మత్స్యకారుల వద్దకు వెళ్లి సంఘీభావం తెలియజేశారు. మత్స్యకారుల జీవనోపాధికి ఆటంకం కలిగించే పైప్‌లైన్‌ను తక్షణం తొలగించాలని ముక్తకంఠంతో మత్స్యకారులు ఎంపీని డిమాండ్ చేశారు. దీనిపై చర్చించేందుకు మత్స్యకారులు సోమవారం కలెక్టర్ కార్యాలయానికి వచ్చి సమస్యను వివరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న మత్స్యకారులను ఇబ్బందులకు గురిచేయవద్దని పోలీసులకు సూచించారు.



కోనపాపపేటలో నాలుగో రోజు ఆందోళనలో పాల్గొన్న మత్స్యకారులు

ఈవీఎం, వీవీ ప్యాట్‌ల వినియోగంపై శిక్షణ

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 9: ఈవీఎంలను ఎలా వినియోగించాలి.. వీవీ ప్యాట్ ద్వారా ఎవరికి ఓటు వేశారో ఓటరు ఎలా తెలుసుకోవాలి.. వీటి పనితీరు ఎలా ఉంటుంది.. ఈవీఎం, వీవీ ప్యాట్‌లు సమర్థవంతంగా పనిచేసేలా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? వంటి అంశాలపై ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బందికి శనివారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ కళాశాలలో ఈ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎన్నికల విధుల్లో ఉన్న 528మంది పీవోలు, ఏపీవోలు ఈ శిక్షణకు హాజరయ్యారు. కాకినాడ సిటీ నియోజకవర్గ ఆర్వో, నగరపాలకసంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఈ శిక్షణా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సిటీ నియోజకవర్గ పరిధిలోని 22సెక్టార్‌ల పరిధిలో ఈశిక్షణ నిర్వహించారు. అసెట్ లయబిలిటీ మేనేజ్‌మెంట్ అండ్ ట్రజరీ, సెక్టార్ అధికారుల పర్యవేక్షణలో ఈ మొదటి విడత శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మాక్‌పోల్ ఎలా నిర్వహించాలి? పోలింగ్‌కు ముందు, పోలింగ్ జరిగే రోజు చేపట్టే విధులపై సంపూర్ణ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్వో జె.వెంకటరావు మాట్లాడుతూ ఈవీఎం, వీవీప్యాట్ పనితీరుపై ఎన్నికల సిబ్బంది సంపూర్ణ అవగాహన కల్పించుకోవాలన్నారు. శిక్షణలో ఇచ్చిన తర్ఫీదు ఆధారంగా రానున్న ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరగడంలో ఎన్నికల సిబ్బంది పాత్ర అత్యంత ప్రధానమన్నారు. కార్యక్రమంలో కాకినాడ అర్బన్ తహసీల్దార్ దొర, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఎన్నికల డిప్యూటీ తహసీలార్లు సీతాపతిరావు, నాయుడు, దీపక్, పవన్ పాల్గొన్నారు.



శిక్షణ పర్యవేక్షిస్తున్న కమిషనర్ వెంకటరావు

ఆహ్లాదం మాటున.. మృత్యు కుహారం

- ప్రాణాలు మింగేస్తున్న బోట్‌క్లబ్ చెరువు
- చుట్టూ రక్షణ కంచె ఉన్నా ప్రమాదాలు
- గత రెండు నెలల్లో ఇద్దరు మృతి

సర్పవరం జంక్షన్(కాకినాడ), మార్చి 9: సాయంసంధ్య వేళ సందర్శకులకు ఆహ్లాదాన్ని అందించే కాకినాడ బోట్‌క్లబ్ పార్కులోని చెరువు ప్రాణాలను మింగేస్తోంది. ప్రజలకు ఆహ్లాదాన్ని అందించాల్సిన పార్కు ప్రజల ప్రాణాలు తీసే మృత్యుకుహరంగా మారింది. అధికారులు చెరువులోకి ఎవరూ దిగకుండా రక్షణగా కంచె ఏర్పాటు చేసినా ఆ రక్షణ చర్యలు ఏమాత్రం ప్రజల ప్రాణాలను కాపాడలేకపోతున్నాయి. ఈ చెరువలో పడి ఈ ఏడాది మూడు నెలల్లో ఇద్దరు మృత్యువాత పడ్డారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బోట్‌క్లబ్ పార్కులో మరణాలు జరగకుండా మున్సిపల్ కమిషనర్ మరింత కట్టుదిట్టమైన భద్రత, రక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

32 ఎకరాల విస్తీర్ణంలో..

కాకినాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రూరల్ నియోజకవర్గ పరిధిలోని ఒకటో డివిజన్‌లో బోట్‌క్లబ్ పార్కును ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పిఠాపురం కాకినాడ ప్రధాన రహదారిలో రోడ్డు మార్గానికి ఆనుకుని 32 ఎకరాల విస్తీర్ణంలో భోగందాని చెరువు(బోట్‌క్లబ్) ఉంది. పూర్వం రవాణా వ్యవస్థ అందుబాటులో లేని సమయంలో పాదచారులు, ప్రయాణికులకు తాగునీరు, పశువులకు నీరందించేందుకు పూర్వం పిఠాపురం మహారాజా చెరువు తవ్వించారు. 1975 వరకు ఈ చెరువులోకి గోదావరి నీరు వచ్చేది. కాలక్రమేణా పంట కాలువలు ఆక్రమణకు గురికావడం, అక్రమకట్టడాలు నిర్మించడం వంటి కారణాలతో వరిసాగు, బోట్‌క్లబ్‌కి నీరొచ్చే అవకాశం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో భోగందాని చెరువును బోట్‌క్లబ్‌గా మార్చి 1984నుంచి ప్రభుత్వం అభివృద్ధి చేపట్టింది. అప్పటినుంచి ఏటా బోట్‌క్లబ్ అభివృద్ధి చెందుతోంది.

రివిట్‌మెంట్ ఏటవాలుగా ఉండడంతో..

కాకినాడ స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చెందుతున్న క్రమంలో ఆధునికీకరణకోసం ప్రభుత్వం కోట్లాది నిధులు కేటాయించి బోట్‌క్లబ్ పార్కు, చెరువును అభివృద్ధి చేసింది. బోట్‌క్లబ్‌లో షికారుకోసం ప్రత్యేకంగా బోట్ ఉండేది. సరైన నీటి సౌకర్యం, నిర్వహణ లేక మూలకు చేరడంతో బోట్‌షికారు అటకెక్కింది. రూ.9కోట్ల స్మార్ట్‌సిటీ నిధులతో పలు అభివృద్ధి పనులు చేశారు. ఇందులో భాగంగా పార్కు బ్యూటిఫికేషన్‌లో భాగంగా గట్టుచుట్టూ ఏటవాలుగా సిమెంట్ కాంక్రీట్ దిమ్మలను ఏర్పాటు చేశారు. చెరువు చుట్టూ రక్షణగా ఇనుప ఊచలు వేసి రక్షణగా కంచె ఏర్పాటు చేశారు. చెరువు చుట్టూ రివిట్‌మెంట్ వాలుగా ఉండడం, చెరువు లోతుగా ఉండడంతో పార్కు సందర్శన కోసం వచ్చే వారు పొరపాటున ఇనుప గ్రిల్స్ పై నుంచి కింద పడితే చెరువుకు ఏటవాలుగా ఉన్న రివిట్‌మెంట్‌పై నుంచి దొర్లుకుంటూ లోతైన చెరువులో పడి ప్రాణాలు కోల్పోతున్నారు. 2022కు ముందు చెరువు చుట్టూ సరైన రక్షణ వ్యవస్థ లేకపోవడంతో ఆ ఏడాదిలో ముగ్గురు చెరువులో పడి మృత్యువాత పడ్డారు. అప్పటి కమిషనర్ స్వప్నిల్ దినకర్ చెరువు చుట్టూ రక్షణగా ఇనుపగ్రిల్స్‌తో కంచెలాంటి ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు. పార్కు చుట్టూ తక్కువ ఎత్తులో ఉన్న ప్రహరీ ఎత్తును పెంచి నిర్మాణం చేయించారు. పార్కు మూసివేసిన తర్వాత ప్రహరీ దూకి పార్కులోకి రాకుండా చర్యలు చేపట్టారు. దీంతో ఏడాదిపాటు ఏ మరణాలు చోటుచేసుకోలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి 26న అనారోగ్యంతోఉన్న వృద్ధురాలు కుటుంబసభ్యులకు భారం కాకూడదనే ఉద్దేశంతో పార్కులోకి వచ్చి చెరువులోకి దూకేసి ఆత్మహత్యకు పాల్పడింది. మార్చి 8న రమణయ్యపేట గొల్లపేటకు చెందిన గొర్ల వెంకటరమణ(64) వృద్ధుడు వెంకట రమణ ప్రమాదవశాత్తూ చెరువులో పడి ప్రాణాలు కోల్పోయాడు.



సర్పవరం జంక్షన్‌కు సమీపంలో ప్రాణాంతకంగా మారిన బోట్‌క్లబ్ పార్కులోని చెరువు

ఇవిగో సంఘటనలు

- 2022, ఫిబ్రవరి 6న రమణయ్యపేటకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు కిలాడి నాగయక్ష సూర్యకుమార్(12), వాసంసేవా(10) పార్కులోకి సరదాగా గడిపేందుకు వెళ్లి చేపలకోసం చెరువులో దిగి ప్రమాదవశాత్తూ చెరువులో పడి మృత్యువాత పడ్డారు.
- 2022, మార్చి 22న రమణయ్యపేట శివారు గైగోలుపాడుకు చెందిన కొండ శ్రీచైతన్య(10) బాలుడి చెప్పుకోసం వెళ్లగా ప్రమాదవశాత్తూ చెరువులో జారిపడి మృతి చెందాడు. చెరువులో మునిగిపోతున్న బాలుడ్ని కాపాడబోయిన విజయవాడకు చెందిన ఎన్.మధుసూదన రావు(55) నీటిలోకి దిగడంతో ఊపిరాడక మృతి చెందాడు. 2021లో ఇద్దరు వ్యక్తులు చెరువులో పడి మృతి చెందిన సంఘటనలు చోటుచేసుకున్నాయి.

తెలుగు భాషను భావితరాలకు చేర్చాలి

భాషపై సానుకూల దృక్పథం కలిగేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలి

మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు

కాకినాడలో ప్రారంభమైన అఖిల భారత తెలుగు సాహితీ సదస్సు

దేశవిదేశాల నుంచి సాహితీవేత్తలు హాజరు



వెంకయ్యనాయుడును సత్కరిస్తున్న ప్రముఖులు

పోర్టుసిటీ (కాకినాడ), మార్చి 9: భావితరాలకు తెలుగు భాష సంస్కృతి పట్ల సానుకూల దృక్పథం కలిగేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. తెలుగు భాష అమ్మపాల వంటిదన్నారు. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా కన్న తల్లి, మాతృభాష, మాతృదేశాన్ని మరువకూడదని చెప్పారు. తెలుగు భాష పరిరక్షణ కోసం వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం సంయుక్త నిర్వహణలో దంటు కళా క్షేత్రంలో రెండు రోజుల పాటు నిర్వహించే సదస్సును శనివారం మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వంగూరి ఫౌండేషన్ అధ్యక్షుడు వంగూరి చిట్టెన్‌రాజు అధ్యక్షతన జరిగిన సదస్సులో వెంకయ్యనాయుడు మాట్లాడారు. ఆట, పాట, కట్టు, బొట్టు, సంస్కృతి తెలుగు భాష విశిష్టతను తెలియజేస్తాయని వివరించారు. రాబోయే తరాలకు ప్రతిఒక్కరూ సాహిత్య పరిమళాలను అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. నన్నయ్య, తిక్కన, శ్రీనాథుడు, పోతన వంటి వారు తెలుగు సాహిత్యానికి ప్రాణం పోశారని గుర్తు చేశారు. అన్నమయ్య, భర్తృహరి లాంటి వారు అచ్చ తెలుగు పదాలతోనే గేయాలు, కవితలు రాశారని చెప్పారు. రాచరికంలో రాజులు కవులను ప్రోత్సహించిన విధంగానే, నేటి ప్రభుత్వాలు భాషాభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. మమ్మి, డాడీ సంస్కృతి పోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లలతో అమ్మానాన్న అని పిలిపించుకోవాలని అన్నారు. మాజీ రాజ్యసభ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాషను బతికించుకునేందుకు సాహితీ సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. భాషాభివృద్ధి కోసం తన వంతు సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. శాసనసభ మాజీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తెలుగుభాష పరిరక్షణకు మరిన్ని సదస్సులు నిర్వహించాలని ఆకాంక్షించారు. సాహితీవేత్తలంతా ఒకచోట హాజరై తమ ప్రావీణ్యాన్ని ప్రదర్శించడం సంతోషకరమని చెప్పారు. ఫౌండేషన్ అధ్యక్షుడు వంగూరి చిట్టెన్‌రాజు మాట్లాడుతూ సదస్సు కోసం దేశ, విదేశాల నుంచి సాహితీవేత్తలంతా తరలిరావడం హర్షణీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని సదస్సులు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా వంగూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నాలుగు పుస్తకాలను ముఖ్య అతిథి వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫ్రాన్స్‌కు చెందిన డేనియల్ నేజర్, డాక్టర్ వంశీ రామరాజు, మంగిపూడి రాధిక, ఎర్రాప్రగడ రామకృష్ణ, వైఎస్ఎన్ మూర్తి, పతంజలిశాస్త్రి, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, భువనచంద్ర తదితరులు తమ అభిప్రాయాలను చర్చావేదిక రూపంలో అందించారు. సదస్సుకు 100 మందికి పైగా సాహితీవేత్తలు హాజరయ్యారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు మార్ని జానకీరామ్‌చౌదరి, కె.గౌరీనాయుడు, మణిబాబు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న వెంకయ్యనాయుడు



మండలి బుద్ధప్రసాద్‌కు జ్ఞాపిక బహూకరణ

అప్పనపల్లిలో భక్తుల రద్దీ



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు, మార్చి 9: భక్తుల తాకిడితో అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం శనివారం కిటకిటలాడింది. వేకువజాము నుంచి భక్తులు వైనతేయ నదిలో స్నానమాచరించి బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. కొత్త, పాత గుడులు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం స్వామివారిని 3459మంది దర్శించుకుని 2571 మంది అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,35,039 ఆదాయం వచ్చిందని ఏసీ జి.మాధవి తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

శృంగారవల్లభ స్వామి ఆలయానికి భక్తుల తాకిడి



పెద్దాపురం, మార్చి 9: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ. 3,63,450 అన్నదాన విరాళాలు రూ. 81,441 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.4,320, తులాభారం రూ.400 వెరసి రూ.4,49,611 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం చైర్మన్ కర్రి జగదీష్, దేవస్థానం అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భీమేశ్వరుని రథోత్సవం



రథాన్ని లాగి ప్రారంభిస్తున్న చినరాజప్ప, దొరబాబు





సామర్లకోట, మార్చి 9: మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా సామర్లకోటలో కుమారరామ భీమేశ్వరస్వామి, బాలా త్రిపుర సుందరి అమ్మవార్ల రథోత్సవం శనివారం సాయంత్రం ఘనంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయం నుంచి పల్లకీపై ప్రదర్శించుకుని గాంధీబొమ్మసెంటర్‌కు మంగళవాయిద్యాల మధ్య తీసుకుని వచ్చారు. అప్పటికే రథంపై సిద్ధంగా ఉన్న పండితులు చెరుకూరి రాంబాబు, అంజిబాబు, శ్రీనివాస రావు, వినయ్ ఉత్సవమూర్తులను పల్లకీ నుంచి రథం వేదికపై అలంకరించారు. శాస్త్రోక్తంగా గుమ్మడికాయను అన్నం కుంభంపై పగలకొట్టి హారతులు ఇవ్వగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మ కాయల చినరాజప్ప తాడు లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పెద్దాపురం ఇన్‌చార్జి దవులూరి దొరబాబు, కౌన్సిలర్, రథోత్సవ కమిటీ ప్రతినిధి యార్లగడ్డ జగదీష్, టీడీపీ, వైసీపీ నాయకులు ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం తది తరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం జరిగిన రథోత్సవంలో వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, వైసీపీ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు తదితర ప్రజాప్రతినిధుల సమక్షంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు.

కోల సంబరం, వీరభద్రుని సంబరం, గోవింద గోవింద నృత్యం, కోబ్రా నృత్యం, తీన్మార్ డప్పుల డ్యాన్స్ విశేషంగా ఆకట్టుకున్నాయి, బాణసంచా కాల్పులు, మంగళవాయిద్యాల నడుమ వందలాది మంది భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు. విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ సిబ్బంది రథోత్సవాన్ని అనుసరించారు. అంతకుముందు ఉదయం భీమేశ్వరాలయంలో స్వామివారికి అభిషేక పూజలు, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో ధూపసేవ నిర్వహించి పల్లకీలో దేవతామూర్తులను అలంకరించి రథోత్సవం వరకూ పల్లకీ సేవ నిర్వహించారు.





రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా రథోత్సవం

పిఠాపురం, మార్చి 9: పిఠాపురం పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమా కుక్కుటేశ్వర స్వామి రథోత్సవం శనివారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. విద్యుత్ దీపాలతో అలంకరించిన రథంపై ఉత్సవ మూర్తులను ఉంచి కుంతీ మాధవస్వామి కోనేరు నుంచి ఉప్పాడ బస్టాండ్ వరకూ రథాన్ని లాగి సెంటర్‌లో నిలిపారు. భక్తులు స్వామి, అమ్మవార్లను రథంపై దర్శించుకున్నారు. అక్కడ బాణాసంచా కాల్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అంతకు ముందు స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీపై ఉంచి పాదగయ నుంచి నాయకులు ప్రజాప్రతినిధులు పల్లకీని మోస్తూ కుంతీ మాధవస్వామి దేవస్థానం వరకూ తీసుకువచ్చి అక్కడ రథంపై ఉంచారు.. రథోత్సవంలో కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కార్యనిర్వహణాధికారి పులి నారాయణమూర్తి, సీఐ శ్రీనివాస్, ఉత్సవకమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



రంగులు చల్లుకుంటున్న అర్చక స్వాములు



ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో పోలీసులు

సంబరంగా సాగిన నాకబలి..దొంగలతోపు

పిఠాపురం, మార్చి 9: పాదగయ క్షేత్రంలో కుక్కుటేశుని కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం వివిధ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఉత్సవ విగ్రహాలు చేతపట్టుకుని రంగులు చల్లుతూ నిర్వహించిన కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీసమేత ఉమాకుక్కుటేశ్వస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం స్వామికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, సహస్ర పుష్పార్చన జరిగింది. సాయంత్రం నాకబలి-దండియాడింపు-దొంగలతోపు ఉత్సవం ఉత్సాహపూరితంగా సాగింది. స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై ఉంచి పూజలు జరిపారు. పూజా కార్యక్రమాలు నిర్వహించిన అర్చకులు పరస్పరం రంగులు చల్లుకొన్నారు. ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకిపై ఉంచి దేవస్థానం నుంచి ప్రదర్శనగా తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా నిర్వహించిన విచిత్ర వేషధారణలు, గరగ నృత్యాలు ఆకట్టుకున్నాయి. కింగ్‌కాంగ్ డాల్స్, శక్తి వేషధారణలతో కళాకారులు ప్రదర్శించిన విన్యాసాలు భక్తులను అలరించాయి. కార్యక్రమాల్లో కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఈవో, సహాయ కమిషనరు పులి నారాయణమూర్తి, ఉత్సవ కమిటీ చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. చిన్నారులతో ఎంపీ, ఎమ్మెల్యేలు కోలాటం ఆడారు. పోలీసులు అందరూ ఉత్సవమూర్తులను మోసి కుక్కుటేశుని సేవలో పాలుపంచుకున్నారు.

కోలాహలంగా బాలయోగీశ్వరుల తీర్థం




తపో మందిరం వద్ద భక్తుల సందడి

ముమ్మిడివరం, మార్చి 9: శ్రీభగవాన్ బాలయోగీశ్వరుల తీర్థ మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. బాలయోగీశ్వరుల తపో ఆశ్రమంలో శనివారం తెల్లవారుజామున సుప్రభాతసేవ, ప్రత్యేక అభిషేకాలు, హారతులు, దివ్య సమాధుల వద్ద పూజలు నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మద్రాసు, దేశం నలుమూలల నుంచి భక్తులు భగవాన్ పెదబాలయోగీశ్వరులు, చినబాలయోగీశ్వరుల దివ్య సమాధులను దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు స్వామివారి దివ్య సమాధులను భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు వసతి, భారీ అన్న సమారాధన వంటి వాటిని ఏర్పాటు చేశారు. తపో ఆశ్రమ కమిటీ, కుటుంబ సభ్యులు భక్తులకు అవసరమైన వసతి, భోజన సదుపాయాలు కల్పించారు. మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, హితకారిణి సమాజ్ చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, పెన్మెత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, కోలా బాబ్జి, కుడుపూడి శంకరరావులతో పాటు వైసీపీ నాయకులు, జడ్పీటీసీ సభ్యులు బాలయోగీశ్వరుల దివ్య సమాధులు, విగ్రహాలను దర్శించుకుని పూజలు జరిపించారు. జనసేన పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు పితాని బాలకృష్ణ, పార్టీ నాయకులు బాలయోగీశ్వరుల దివ్య సమాధులను దర్శించుకున్నారు. ఆయన వెంట దూడల స్వామి, సానబోయిన వీరభద్రరావు, యలమంచిలి బాలరాజు, పితాని రాజు, గొలకోటి సాయి బాబులతో పాటు పలువురు ఉన్నారు.



తీర్థానికి వచ్చిన భక్తులు

కిటకిటలాడిన వాడపల్లి



ఆత్రేయపురం, మార్చి9: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువ జామునే స్వామి వారికి సుప్రభాతసేవ, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల సుగంధ పరిమళాలు వెదజల్లే పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు తిరు వీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. తలనీలాలు, తులాభారాలు, కానుకలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.46.84 లక్షలు లభించినట్టు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు



స్వామివారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

దుర్గాడ శివాలయంలో అభిషేకాలు



గొల్లప్రోలు రూరల్, మార్చి 9: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి శనివారం అభిషేకాలు నిర్వహించారు. లింగోద్భవకాల అభిషేకంతో పాటు స్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ఆవుపాలు, పెరుగు, నెయ్యి, పంచదార, పండ్లు, చెరకు రసాలు, విభూది, గంధం, రోజ్ వాటర్ తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిగాయి. అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. స్వామిని పుష్పాలతో, ఆయా అభిషేక ద్రవ్యాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు జరిపించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భావనారాయణస్వామికి వెండి ఆభరణాలు



వెండి ఆభరణాలు తీసుకువస్తున్న దాతలు

సర్పవరం జంక్షన్, మార్చి 9: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే సుప్రసిద్ధ పురాతన పుణ్య క్షేత్రంగా విరాజిల్లుతున్న సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణస్వామికి రూ.6.50 లక్షల విలువ చేసే రూ.7.50 కిలోల వెండి ఆభరణాలను భక్తులు సమర్పించారు. కాకినాడకు చెందిన భక్తులు చిక్కాల చౌదరయ్య (తాతాజీ), సత్యపూర్ణలక్ష్మి దంపతులు శనివారం సర్పవరం స్వామివారి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు, ఈవో జొన్నాడ భీమశంకరరావుకు రూ.7.50 కిలోలతో తయారు చేయించిన అమ్మవారి కిరీటం, వెండి కర్ణపత్రాలు, కమలా హస్తములు, అభయ హస్తములు, వృక్షస్థలాభరణం, బుట్ట చీరాభరణం, రాజ్యలక్ష్మి అమ్మవారికి వెండి వడ్డాణం, ఉత్సవమూర్తులు శ్రీదేవి భావనారాయణస్వామికి వెండి వడ్డాణాలను అందజేశారు. వెండి ఆభరణాలు అందించిన చౌదరయ్యసత్యపూర్ణలక్ష్మి దంపతులకు గ్రామస్థుల తరపున చైర్మన్ నారాయణరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ చరిత్ర తెలియజేసే పుస్తకం, స్వామివారి ప్రసాదాన్ని దాతలకు అందించారు.

లింగోద్భవకాల పూజలు

సామర్లకోట, మార్చి 9: మహాశివరాత్రి విశేష పూజలలో భాగంగా శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి శనివారం తెల్లవారుజామున 2 గంటల వరకూ భీమేశ్వరుని శివ లింగానికి లింగోద్భవకాల పూజలు వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజలను కంచి మహా సంస్థానం వ్యవస్థాపక కుటుంబీకులు చంద్రాభట్ల పతంజలి తదితర పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. పంచ ద్రవ్యములతో అభిషేకించారు. మానస సరోవరం నుంచి తెచ్చిన లక్షలాది పవిత్ర రుద్రాక్షలు స్వామివారిని అభిషేకించారు. అనంతరం నూతన పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తుల దర్శనాలకు అనుమతించారు. పూజల అనంతరం రుద్రాక్షలను పతంజలి చేతుల మీదుగా పలువురు భక్తులకు పంపిణీ చేశారు. ఈ పూజలలో పారిశ్రామికవేత్త మట్టే శ్రీనివాస్ విద్యుల్లత దంపతులు, బిక్కిన పరమేశ్వర సాయి సత్యనారాయణ, చుండ్రు గోపాలకృష్ణ, ఆర్వీ సుబ్బరాజు, గంజి బూరిబాబు, అమలకంటి శ్రీనివాసరావు, గుండు శంకరరావు తదితరులు పాల్గొన్నారు. ఆదివారం స్వామివారికి త్రిశూలస్నానం, తీర్థపు సేవ నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నీలకంఠం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

వేట కుక్క దాడిలో కణుజు మృతి



పరిశీలిస్తున్న అటవీ శాఖాధికారులు

తుని రూరల్, మార్చి 9: వేట కుక్క దాడిలో కణుజు హతమైంది. కాకినాడ జిల్లా తుని మండలం కుమ్మరిలోవ సమీపంలో కొండ దిగువకు కణుజు వచ్చింది.. కుమ్మరిలోవ ఎస్ఎస్‌వీ నగరం, ఎస్.సూరవరం, కొలిమేరు ప్రాంతాలను ఆనుకుని ఉన్న పచ్చటి కొండల్లో వన్యప్రాణులు తలదాచుకుంటున్నాయి. అయితే వీటిపై అధికార పార్టీకి చెందినఒక వేటగాడు కన్ను పడటంతో ఆ ప్రాంతంలో యథేచ్ఛగా వన్యప్రాణులను వేటాడుతున్నట్లు తెలిసింది. ఈ కోవలోనే కణుజును కుక్కలు వేటాడి హతమార్చి ఉంటాయని స్థానికులు చెబుతున్నారు కుమ్మరిలోవ సమీపంలో వేటకుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన తల్లి, పిల్ల కణుజు కుమ్మరిలోవ ప్రాంతానికి చేరుకున్నాయి. అయితే స్థానికులు వాటిని గమనించి కాపాడే ప్రయత్నం చేశారు. స్థానికుల రాకతో పిల్ల కణుజు కొండపైకి వెళ్లగా, తల్లి కణుజు గాయాలతో పడి ఉంది. స్థానికులు కాపాడే ప్రయత్నం చేయగా కొద్ది సేపటికే మృతి చెందినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. కేసు నమోదు చేసి, కణుజును ఖననం చేసినట్లు ఎఫ్ఎస్‌వో రాంబాబు తెలిపారు.

కాకినాడ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలేశ్వరం, మార్చి 9: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కె.రత్నాలరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఏలేశ్వరం, లింగంపర్తి, భద్రవరం, సి.రాయవరం, జె.అన్నవరం, తూర్పులక్ష్మీపురం తదితర గ్రామాల్లో ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్టు ఆయన స్పష్టం చేశారు.

కుట్ర రాజకీయాలు చేస్తున్న ద్వారంపూడి

మాజీ ఎమ్మెల్యే కొండబాబు



చమురు తవ్వకాల సర్వే లేఖ చూపుతున్న కొండబాబు

కాకినాడ సిటీ, మార్చి 9: గ్రావెల్ కొండలు తవ్వి వేల కోట్ల రూపాయల ప్రకృతి సంపదను, టీడీఆర్ బాండ్ల రూపంలో రూ.500కోట్ల నగర ప్రజల కష్టార్జితాన్ని దోచుకున్న కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి మత్స్యకారులకు అందాల్సిన చమురు నిక్షేపాల నష్టపరిహారాన్ని దోచుకునేందుకు కుట్ర రాజకీయాలు చేస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ధ్వజమెత్తారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో చమురు కంపెనీలు చేసిన చమురు నిక్షేపాల వెలికితీతవల్ల మత్స్యకార కుటుంబాలకు అందాల్సిన నష్ట పరిహారం నిధులు రూ.వెయ్యి కోట్లను జగన్‌రెడ్డి, ద్వారంపూడి దోచుకుని మత్స్యకారులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కాకినాడ తీర ప్రాంతానికి 65 కిలోమీటర్ల దూరంలో చమురు నిక్షేపాల వెలికితీత కోసం ఓఎన్‌జీసీ సిస్మిక్ సర్వే చేపట్టేందుకు కేంద్ర కార్యాలయం నుంచి ఈ ఏడాది జనవరి 9న సర్క్యులర్ పంపితే జిల్లా కలెక్టర్, మత్స్యశాఖ అధికారులు ఇంతవరకు మత్స్యకారులకు తెలియపరచకుండా దాచి పెట్టారన్నారు. నేడు ఓటమి భయంతో మత్స్యకారులను మభ్యపెట్టేందుకు ఉద్యమాల పేరుతో ద్వారంపూడి మోసం చేస్తున్నాడన్నారు. సమావేశంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల మత్స్యకార నాయకులు కోడా వెంకటరమణ, చొక్కా జగన్, సంగాని నాగేశ్వరరావు, మల్లాడి రాజు, చొక్కా గోవింద్, తుమ్మల రమేష్ చోడిపల్లి సతీష్, గంటా నరసింహం, మూగు రాజు, ఎరిపిల్లి అబ్బాయి పాల్గొన్నారు.

'వైసీపీ కుట్రలను తిప్పికొట్టాలి'

తాళ్లరేవు, మార్చి 9: వైసీపీ కుట్రలను తొప్పి కొట్టి ఆ పార్టీ రాక్షసపాలనపై ప్రజలకు జనసేన, టీడీపీ కార్యకర్తలు వివరించాలని టీడీపీ సీనియర్ నేత టేకుమూడి లక్ష్మణరావు అన్నారు. శనివారం తాళ్లరేవు టీడీపీ కార్యాలయంలో జనసేన-టీడీపీ కార్యకర్తల మండలస్థాయి సమావేశం జరిగింది. టేకుమూడి మాట్లాడుతూ ముమ్మిడివరం జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు ఎన్నికల ప్రచారం సోమవారం నుంచి పిల్లంక గ్రామంలో ప్రారంభవుతుందన్నారు. జనసైనికులు, టీడీపీ కార్యకర్తలంతా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు చెప్పాలన్నారు. టీడీపీ నేతలు సాగి వెంకటసుబ్బరాజు, మందాల గంగసూర్యనారాయణ, ధూళిపూడి వెంకటరమణ, మోపూరి వెంకటేశ్వరరావు, వాడ్రేవు వీరబాబు, వేగేశ్న భాస్కరరాజు, పొన్నమండ రామలక్ష్మి, పెమ్మాడి కృష్ణవేణి, జక్కల ప్రసాద్‌బాబు, మోర్త భైరవమూర్తి, పెసింగి ఈశ్వరరావు, జనసేన వీరమహిళ ముత్యాల సయలక్ష్మి, సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు పాల్గొన్నారు.

'పార్టీ కోసం కష్టపడిన వారికే టిక్కెట్లు ఇవ్వాలి'

కాకినాడ సిటీ, మార్చి 9: కాంగ్రెస్ పార్టీ కోసం అనేక ఏళ్లుగా కష్టపడిన వారికే టిక్కెట్లు ఇవ్వాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకటరమణ కోరారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టికెట్ కోసం దరఖాస్తు చేసిన వారితో ఈనెల 6న విజయవాడలో ఏర్పాటు చేసిన ముఖాముఖిలో కాకినాడ జిల్లా ఆశావహులతో నేతలు విడిగా మాట్లాడారని తెలిపారు. కాకినాడ సిటీ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి కోలా ప్రసాదవర్మ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల టికెట్లు పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి ప్రకటిస్తారన్నారు. సమావేశంలో నాయకులు తుమ్మలపల్లి వాసు, కంభం రాజబాబు, పోలిశెట్టి శ్రీనివాసు, లంకే పకీర్‌రాజు, పబ్బినీడి కృష్ణ, పలగల రాజు, పాండ్రంగి రమణమూర్తి, వల్లూరి రామ్మోహన్ పాల్గొన్నారు.త

'ప్రజల కోసం పనిచేస్తున్న టీడీపీ, జనసేన'

తొండంగి, మార్చి 9: వైసీపీ స్వప్రయోజనం కోసం పాటుపడితే టీడీపీ, జనసేన పార్టీలు ప్రజల మేలుకోరి పనిచేస్తున్నాయని తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పేకేటి హరికృష్ణ అన్నారు. శనివారం దానవాయిపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించి టీడీపీ రూపొందించిన సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంచి వివరించారు. రాష్ట్రంలో పేదల అభ్యున్నతికి సూపర్ సిక్స్ పథకాలను తమ పార్టీ ప్రకటించిందన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే టీడీపీ, జనసేన ప్రభుత్వం రావాలని అందుకు ప్రజలంతా సహకరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకార నాయకుడు కోడ వెంకటరమణ, మండలాధ్యక్షుడు చొక్కా అప్పారావు, ప్రధాన కార్యదర్శి మురాలశెట్టి సత్యన్నారాయణ, బుల్లబ్బాయి, చొక్కా కాశీశ్వరరావు పాల్గొన్నారు.

'ఎండిపోతున్న వరిచేలకు సాగునీరందించాలి'

తాళ్లరేవు, మార్చి 9: చొల్లంగిలో ఎండిపోతున్న వరిచేలకు ఇరిగేషన్ శాఖాధికారులు సాగునీరందించి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. శనివారం చొల్లంగి, చొల్లంగిపేట, జి.వేమవరం ప్రాంతాల్లో సాగునీటి ఎద్దడితో పాటు ఎండిన చేలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారులకు ముందుచూపు లేకపోవడం వల్ల రైతులకు సాగునీటి ఎద్దడి సమస్య ఎదురవుతుందన్నారు. వేల రూపాయిలు పెట్టుబడులు పెట్టిన రైతులకు సాగునీరందిక సుమారు 250 ఎకరాలు ఎండిపోతున్నాయని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి సాగునీరు అందించే చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

ఏలేశ్వరంలో లిబరేషన్ పార్టీ ఆందోళన

ఏలేశ్వరం, మార్చి 9: ఏలేశ్వరంలో యువతికి కుల ధృవీకరణపత్రం కోసం లిబరేషన్ పార్టీ ఆందోళన చేపట్టింది. శనివారం సీపీఐ ఎంఎల్ వినోద్ మిశ్రా ప్రగతిశీల మహిళాసంఘం రాష్ట్ర నాయకురాలు గండేటి నాగమణి ఆధ్వర్యంలో బాలాజీ చౌక్ సెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. వినోద్ మిశ్రా నగర్‌కు చెందిన పిల్ల అఖిలకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వడానికి తహశీల్దార్ వై.రంగారావు వంశవృక్షం సర్టిఫికెట్ కావాలని చెప్పుతున్నారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గండేటి నాగమణి, గుమ్మడి పాదాలమ్మ, కందుల వరలక్ష్మి, పాలప సుందరి, జయమ్మ, గోనాపు వరాలమ్మ ఉన్నారు.

ప్రగతి శీల మహిళా సంఘం సమావేశం

ప్రత్తిపాడు, మార్చి 9: మండలంలోని చింతలూరులో అఖిల భారత ప్రగతి శీల మహిళా సంఘం కార్యకర్తలు మహిళా సదస్సు నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర కమిటీ నాయకురాలు కాకర రత్నకుమారి మాట్లాడుతూ మహిళలపై దాడులు, అత్యాచారాలు, వేధింపులు పెరుగుతున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పట్టనట్టు వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ప్రతినిధులు రాయలపు సత్యవతి, మాతా రాజమణి, నేలపాటి వెంకటలక్ష్మి, వి.సూర్యాకాంతం, సీతమ్మ, ఆర్.సత్యవతి, ఎ.వరలక్ష్మి, చింతలూరు నేతలు మానుకొండ లచ్చబాబు, తాడిలక్ష్మణరావు ఉన్నారు.

కాకినాడలో 'జనసేన మేము సిద్ధం'

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 9: 19వ డివిజన్ గోలీలపేట యాళ్లవారి వీధిలో జనసేన కాకినాడ సిటీ ఇన్‌చార్జి ముత్తా శశిధర్ ఆధ్వర్యంలో వాతాడి వర్మ, మడికి భాను ప్రకాష్ నాయకత్వంలో చెత్త పన్ను వేసిన చెత్త ప్రభుత్వాన్ని తరిమి వేయడానికి జనసేన మేము సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. మద్దు విజయ్‌కుమార్, ఓలేటి సాయి, విశ్వనాథం, కటుకులమ్మ, శేషారత్నం, వాతాడి రత్నం, చెప్పల లక్ష్మి ఉన్నారు.

సచివాలయంలో వైసీపీ సమావేశం


పారుపాక సచివాలయంలో వైసీపీ సమావేశం

రౌతులపూడి, మార్చి 9: ప్రభుత్వ విధులు నిర్వహించే సచివాలయాల్లో వైసీపీ నేతలు పార్టీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. 3 రోజుల క్రితం రౌతులపూడి సచివాలయం2 లో ఓ సమావేశం నిర్వహించగా శనివారం రౌతులపూడి మండలంలోని బలరామపురం, పారుపాక గ్రామంలో నేను సిద్ధం - నాబూత్ సిద్ధం కార్యక్రమాన్ని వైసీపీ ఎంపీ అభ్యర్థి సునీల్, ప్రత్తిపాడు వైసీపీ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు ఫ్లెక్సీలతో నిర్వహించారు. దీంతో ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహించే సచివాలయాలు వైసీపీకి ఎలాఇచ్చారని టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు.

ఎన్నికల నిర్వహణలో పీవో, ఏపీవోల పాత్ర కీలకం

» జేసీ ప్రవీణ ఆదిత్య


పిఠాపురంలో మాట్లాడుతున్న జేసీ ప్రవీణ ఆదిత్య

పిఠాపురం, మార్చి 9: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడంలో పీవో, ఏపీవోల పాత్ర కీలకమని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రవీణ ఆదిత్య తెలిపారు. పిఠాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన పీవో, ఏపీవోలకు ఈవీఎంలు, వీవీప్యాట్‌ల వినియోగం, సక్రమంగా పోలింగ్ నిర్వహణ తదితర అంశాలపై శనివారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ తరగతులను శనివారం జేసీ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ పి.స్వాతి, మునిసిపల్ కమిషనర్ కనకారావు,ఇతర అధికారులు పాల్గొన్నారు.


పెద్దాపురంలో అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో

ఈవీఎంలపై అవగాహన అవసరం

పెద్దాపురం, మార్చి 9: పోలింగ్ సిబ్బందికి ఈవీఎంలపై అవగాహన అవసరం అని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జె.సీతారామారావు అన్నారు. స్థానిక లూథరన్ హైస్కూల్లో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఈవీఎంల నిర్వహణపై నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ సిబ్బంది తమ విధులను జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ఏజంట్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పోలింగ్ నిబంధనలు తెలియచేయాలని, ఉదయం పోలింగ్‌కు 90 నిమిషాల ముందు మాక్ పోలింగ్ హాజరయ్యేలా పోలింగ్ ఏజంట్లకు తెలియచేయాలన్నారు. శిక్షణకు హాజరుకానీ 29 మంది పోలింగ్ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్టు తెలిపారు. ఆర్డీవో కార్యాలయ ఏవో సుబ్రహ్మణ్యం, పెద్దాపురం, సామర్లకోట తహశీల్దార్లు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్ డీటీలు పద్మజ, భానూకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌పై అవగాహన ఉండాలి

సర్పవరం జంక్షన్, మార్చి 9: రాబోయే ఎన్నికల సక్రమ నిర్వహణ కోసం పోలింగ్, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీవో ఇట్ల కిషోర్ కోరారు. విద్యుత్నగర్‌లో ఐడియల్ ఇంజనీరింగ్ కాలేజీలో పోలింగ్ ప్రక్రియ అమలు, నిర్వహణపై పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్లు సురేష్, దుర్గాప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మదుల ఆధ్వర్యంలో ఈవీఎం, వీవీ పాట్‌లపై ప్రదర్శనాత్మకంగా శిక్షణ ఇచ్చారు. 500 మంది పోలింగ్ అధికారులు, సహాయ అధికారులు పాల్గొన్నారు.

జగ్గంపేటలో శిక్షణ

జగ్గంపేట, మార్చి 9: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ పరిధిలోని పీవోలు, ఏపీవోలకు ఈవీఎంలపై శిక్షణ కార్యక్రమాన్ని ఎలక్షన్ రిట్నరింగ్ అధికారి ఎం.శ్రీనివాసరావు నిర్వహించారు. తహశీల్దార్లు, ప్రభుత్వ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఆడబిడ్డలకు అండగా ఉంటాం'


ఎస్.అన్నవరంలో కరపత్రాలతో దివ్య, మహిళలు

తుని రూరల్, మార్చి 9: ఆడబిడ్డలకు అండగా టీడీపీ, జనసేన ప్రభుత్వం ఉంటుందని తుని టీడీపీ అభ్యర్థి యనమల దివ్య అన్నారు. ఎస్.అన్నవరం గ్రామంలో ప్రచారంలో భాగంగా మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక కార్యాలయంలో దివ్య మాట్లాడారు. ఆర్థిక పరిస్థితులు సహకరించక ఎంతోమంది అక్కాచెల్లెళ్లు ఇంటికే పరిమితమై చదువులు సగంలో ఆపేసే పరిస్థితి ఉండేదని, ఇకపై యువతల కలలకు రెక్కలు అనే పథకం ద్వారా మహిళల భవిష్యత్‌కు భరోసా ఇస్తూ టీడీపీ, జనసేన గ్యారంటీ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. బీసీ డిక్లరేషన్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. యనమల శివరామకృష్ణన్, అప్పల రమేష్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు, మోతుకూరి వెంకటేష్, చోడిశెట్టి వెంకటేష్, చోడరాజు చిరంజీవి రాజు, పోలిశెట్టి రామలింగేశ్వరరావు, పోలిశెట్టి మార్కండేయులు,పోలిశెట్టి ధారబాబు పాల్గొన్నారు.

'ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి'

ప్రత్తిపాడు, మార్చి 9: రాష్ట్రంలో దోపిడీ పాలనకు రోజులు దగ్గర పడ్డాయని, రాబోయే 40రోజుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండి ఓటుతో అరాచక ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ రాజా అన్నారు. ప్రత్తిపాడు 1వ వార్డులో శనివారం బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా టీడీపీ కరపత్రాలను పంపిణీ చేసి వివరించారు. వైసీపీ పాలనలో ప్రత్తిపాడు నియోజకవర్గం అన్ని విధాలా దోపిడీకి గురై అభివృద్ధిలో వెనుకబడిపోయిందన్నారు. రాబోయేది నియోజకవర్గ ప్రజల కష్టాలను కడతేర్చే టీడీపీ, జనసేనల ఉమ్మడి ప్రభుత్వమేనని సత్యప్రభ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, యాళ్ల విశ్వేశ్వరరావు, యాళ్ళ జగదీష్, యర్రాబత్తుల గోవిందనాయుడు, శెట్టిబత్తుల వీ రబాబు, పోలిశెట్టి శ్రీను, జనసేన నాయకుడు గోపిశెట్టి శ్రీను, జెడ్డా రాజేంద్ర, శెట్టిబత్తుల నాని, బొల్లు కొండబాబు, సూ ర్నీడి సురేష్, మంతెన శ్రీను, ఇంధన ఏసుబాబు, మిరియాల శ్రీను, అడ్డాల త్రిమూర్తులు, కొప్పన రాజబాబు, రామిశెట్టి మున్నిబు, సుంకర భవాని, అంబటి బుజ్జి, చెరుకూరి అమ్మాజీ, అప్పికొండ కిశోర్, వెలుగుల నాని, రావూరి తాతాజీ ఉన్నారు.

యనమలను కలిసిన నాయకులు


యనమలను కలిసిన టీడీపీ, జనసేన నేతలు

తుని రూరల్/సర్పవరం జంక్షన్, మార్చి 9: తేటగుంటలో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడును శనివారం టీడీపీ, జనసేన పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్‌గా నియమితులైన పిల్లి సత్యనారాయణమూర్తి, కో కోర్డినేటర్‌గా నియమితులైన కటకంశెట్టి ప్రభాకర్ యనమలను కలిసి పార్టీలో బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు చంద్రబాబు,అచ్చెన్నాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి అన ంతలక్ష్మి, కాకినాడ రూరల్ జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ, టీడీపీ అబ్జర్వర్ కుడుపూడి సత్తిబాబు ఉన్నారు.

టీడీపీ నాయకుల హర్షం

సర్పవరం జంక్షన్, మార్చి 9: టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి భర్త సత్యనారాయణమూర్తిని నియమించడం పట్ల ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. శనివారం వలసపాకలలో పిల్లి నివాసానికి కాకినాడ రూరల్, కరప మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు చేరుకుని పూలమాలలు, బొకేలు, గజమాలతో అభినందించారు. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి విజయానికి కృషి చేస్తామన్నారు. టీడీపీ-జనసేన నేతల సమన్వయ సమావేశం ఈనెల 12న ఇంద్రపాలెంలో అనంతలక్ష్మి కల్యాణమండపంలో నిర్వహించి ఉమ్మడి భవిష్యత్తు కా ర్యాచరణపై చర్చిస్తామన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కర్రి వెంకట్రాజు, మాజీ కార్పొరేటర్ పలివెల త్రిమూర్తులు ఉన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు


జగ్గంపేట: టీడీపీలోకి ఆహ్వానిస్తున్న నెహ్రూ

జగ్గంపేట, మార్చి 9: జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నెహ్రూ స్వగృహం నందు కిర్లంపూడి మండలం శృంగరాయునిపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, మాజీ సొసైటీ డైరెక్టర్ తిరుమల సత్యానందం, పోకల సీతమ్మ, పోకల బాబురావు వైసీపీకి రాజీనామా చేసి నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. నెహ్రూ పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో కిర్లంపూడి మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి గోడే బాల, సర్పంచ్ పట్టు చంటిబాబు, ఎంపీటీసీ సభ్యులు గరగ గోవిందు, ఉపసర్పంచ్ బొజ్జపు శ్రీను, అల్లుమల్లు వెంకన్న, బొజ్జపు నాగేశ్వరరావు, అల్లుమల్లు బాబ్జి, గోడే బాసు పాల్గొన్నారు. జగ్గంపేట టీడీపీ కార్యాలయం వద్ద వెంగయమ్మపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు దశరథ రాంబాబు ఆ పార్టీకి రాజీనామా చేసి నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. అదే గ్రామానికి చెందిన జనసైనికులు నెహ్రూకు మద్దతు తెలిపి ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో వల్లెపు అన్నవరం, అప్పన వీరబాబు, జనసైనికులు బొండా శ్రీను, నయి శెట్టి శివ, ముత్తాల అర్జున్, కొట్టేటి నాగేశ్వరరావు, కుమారగణేష్, మడక మణికంఠ, ప్రగడ నాగేశ్వరరావు, ఏరుపల్లి సురేష్, కుమార్ సింగర్‌రావు, అప్పన్న రాకేష్, కొట్టేటి గణేష్,దశరథ రామకృష్ణ ఉన్నారు.

ఎస్.తిమ్మాపురంలో...

కిర్లంపూడి, మార్చి 9: మండలంలోని ఎస్.తిమ్మాపురం గ్రామంలో వైసీపీకి చెందిన మాజీ సర్పంచ్ ఉమ్మిడి దొరబాబు, రాఘవ ఆధ్వర్యంలో 7వ వార్డు సభ్యులు సమ్మెట సత్తిబాబు, 5వ వార్డు సభ్యులు మందేటి లిల్లిపుష్ప రామకృష్ణ, వనపర్తి భద్రరావు, దేవాబత్తుల సువర్ణరాజు, తుమ్మల రవితేజ, 50 కుటుంబాలకు వైసీపీకి చెందిన వారు ఆ పార్టీకి రాజీనామా చేసి జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, సర్పంచ్‌లు వీరంరెడ్డి కాశిబాబు, జ్యోతుల రాంబాబు, బసవ వీరబాబు, గోడే బాల, గుడాలరాంబాబు, కుర్ర చినబాబు, కంచుమర్తి రాఘవ, సర్పంచ్ పట్టుచంటిబాబు, ఉపసర్పంచ్ బొజ్జపు శ్రీను, ఎంపీటీసీ గరగ గోవిందు, తిరుమల సత్యానందం, కానూరు కాసులు, దాసు, అల్లుమల్లు బాబి, కాళ్ళ వెంకటేష్, అనుకుల శ్రీకాంత్,బొదిరెడ్డి సుబ్బారావు ఉన్నారు.

సాగునీరందక ఎండిపోతున్న పంటలు

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ


వెల్దుర్తిలో ప్రచారం నిర్వహిస్తున్న వర్మ

పిఠాపురం రూరల్, మార్చి 9: సాగునీరందక పంటలు ఎండిపోతున్నా వైసీపీ ప్రజాప్రతినిధులకు పట్టడం లేదని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. పిఠాపురం మండలం వెల్దుర్తి గ్రామంలో శనివారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ, మన ఇంటికి మన వర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉండగా రెండు పంటలకు పుష్కలంగా సాగునీరందించామని గుర్తుచేశారు. ఇప్పుడు సాగునీరందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని, రైతులు అందోళన చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు వారు కావడం వల్లే వారికి రైతుల సమస్యలు తెలియడం లేదని విమర్శించారు. స్థానికుడిగా, ఈ ప్రాంతానికి చెందిన వాడిగా తనకు రైతుల కష్టాలు తెలుసనని, అందుకే పురుషోత్తపట్టణం ఎత్తిపోతల పథకాన్ని తీసుకువచ్చి గోదావరి జలాలును ఏలేరు ఆయకట్టుకు అందించగలిగామని వివరించారు. నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యలపై పోరాటం సాగిస్తున్న తనకు అండగా నిలవాలని కోరారు.

'వర్మను ఆశీర్వదించండి'

కొత్తపల్లి, మార్చి 9: కష్టాల్లో వెన్నంటి ఉండే మాజీ ఎమ్మెల్యే వర్మను ఆశీర్వదించాలని ఆయన సతీమణి లక్ష్మీదేవి కోరారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను కుతుకుడుమిల్లి శివారు కలవలదొడ్డిలో ప్రజలకు ఆమె పంపిణీ చేశారు. కొవిడ్‌లో ప్రాణాలకు లెక్కచేయకుండా ప్రజలకు మందుల కిట్లను పంపిణీ చేసి సేవలందించిన వర్మకు ఎన్నికల్లో విజయం చేకూర్చాలని కోరారు.

ప్రత్తిపాడులో కేంద్రరక్షణ బలగాల కవాతు


ప్రత్తిపాడులో పోలీసుల కవాతు

ప్రత్తిపాడు, మార్చి 9: ప్రత్తిపాడులో శనివారం కేంద్రరక్షణ బలగాలు కవాతు నిర్వహించాయి. రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్‌బాబు మాట్లాడుతూ ఎన్నికల భద్రతా విధులకు విచ్చేసిన కేంద్రరక్షణ బలగాలైన సీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్ స్థానిక పోలీస్ బృందాలతో కలిసి సమస్యాత్మక గ్రామాల్లో ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓటర్ల భద్రత, పోలింగ్ కేంద్రాల ప్రాంతాల్లో శాంతియుత వాతావరణ పరిస్థితులు కల్పించాలనే లక్ష్యంగా ఫ్లాగ్‌మార్చ్ చేపట్టామన్నారు. ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం ఎస్ఐలు ఎం.పవన్‌కుమార్, జి.సతీష్‌కుమార్, వి.కిశోర్‌కుమార్ ఉన్నారు.

కరప మండలంలో...

కరప, మార్చి 9: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేలా నమ్మకం కల్పించడం కోసం కేంద్ర మిలటరీ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామని కాకినాడ రూరల్ సర్కిల్ సీఐ కె.శ్రీనివాస్ తెలిపారు. కరప మండలం పరిధిలోని సమస్యాత్మక గ్రామాలైన గొర్రిపూడి, కరప, అరట్లకట్ట గ్రామాల్లో ఎస్‌డీపీవో కె హనుమంతరావు ఆదేశాల మేరకు కేంద్ర సాయిధ బలగాలతో స్థానిక పోలీసులతో కలసి కవాతు నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు. ప్రజలు నిర్భయంగా ఓటు వినియోగించుకునేలా పోలీసులు సహాయం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కరప ఎస్ఐ రామకృష్ణ, సాయిధ బలగాల అధికారులు పాల్గొన్నారు.


కరప: కవాతుపై ప్రజలకు వివరిస్తున్న పోలీసులు

ఆర్టీసీ బస్సును ఢీకొన్న వ్యాన్


ప్రమాదానికి గురైన బస్సు

గండేపల్లి, మార్చి 9: మండలంలో మల్లేపల్లి గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం ప్రకారం... రాజమండ్రి వైపు నుంచి జగ్గంపేట వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వస్తున్న ఐషర్‌వ్యాన్ ఢీకొని డివైడర్‌పైకి దూసుకువెళ్లింది. దీంతో ఆర్టీసీ బస్సులో వెనుక కూర్చున్న ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయాయి. హైవే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించి గాయపడిన వారిని అంబులెన్స్‌లో స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

ముగిసిన సప్తాహ మహోత్సవాలు

గొల్లప్రోలు, మార్చి 9: పట్టణంలో ఉమారామలింగేశ్వర స్వామి దేవస్థానంలో వారం రోజులుగా జరుగుతున్న సప్తాహ మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. 168 గంటల పాటు నిరంతరాయంగా భజన కార్యక్రమాలు జరిగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 100కిపైగా భక్తిభజన సమాజాల సభ్యులు పాల్గొన్నారు. రాత్రంతా జాగారం నిర్వహించారు. లక్ష్మిగణపతిహోమం, రుద్రహోమం, పూర్ణాహుతి జరిపారు. ఆలయం వద్ద భారీ అన్నదానం జరిగింది. సప్తాహ, ఆలయ కమిటీల సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మహా రుద్రాభిషేకం

కోటనందూరు, మార్చి 9: మండలంలోని కెవో.అగ్రహారం గ్రామంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో మహా రుద్రాభిషేకం పండితులు దుర్గా ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో రుద్రాభిషేకంలో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

'ఆదిత్య'లో ముగిసిన వర్క్‌షాప్

గండేపల్లి, మార్చి 9: సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ అనే అంశంపై 6రోజులపాటు నిర్వహించిన వర్క్‌షాప్ శనివారంతో ముగిసిందని ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. కార్పొరేషన్ ప్రతినిధి ఎస్.వరప్రసాద్, డీన్ అకడమిక్స్ డాక్టర్ పుల్లెల రవికుమార్, విభాగాధిపతి జి.మూర్తి, రవికుమార్ ఉన్నారు.

పోషకాహార కిట్ల పంపిణీ

ప్రత్తిపాడు, మార్చి 9: ప్రత్తిపాడులో పేద విద్యార్థులకు సదా మీ సేవలో స్వచ్ఛంద సేవా సంస్థ పో షకాహార కిట్లు పంపిణీ చేసింది. షిర్డి సాయి జ్యూయలర్స్ అధినేత పడాల శ్రీనివాస రెడ్డి సామాజికసేవలో భాగంగా ఈ కిట్లను పీఎఫ్ కన్సల్టెంట్ ఎంపీ సుబ్రహ్మణ్యం విద్యార్థులకు అందజేశారు. సంస్థ ప్రతినిధులు జి.సత్యానందం, బేరి రాంబాబు, ఎస్సీ సోమేశ్వరరావు, చిరసాల లక్ష్మి, జి.లక్ష్మి తదితరులు ఉన్నారు.

వెంకయ్యను కలిసిన దొరబాబు

పిఠాపురం, మార్చి 9: భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడిని పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు కలిశారు. కాకినాడలోని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పైడా కృష్ణమోహన్ ఇంటికి వచ్చిన వెంకయ్యనాయుడిని దొరబాబు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. పలువురు వైసీపీ నాయకులున్నారు.

టీడీపీ, జనసేన సమావేశం వాయిదా

జగ్గంపేట, మార్చి 9: జగ్గంపేట పరిణయ ఫంక్షన్ హాల్లో ఆదివారం జరగవలసిన టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తల ఆత్మీక సమావేశం అనివార్య కారణాల వద్ద వాయిదా పడిందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ తెలిపారు. మళ్లీ త్వరలోనే కార్యాచరణ తెలియజేస్తామన్నారు.

ఎమ్మెల్యే రాజప్ప ఎన్నికల ప్రచారం

సామర్లకోట, మార్చి 9: సామర్లకోట గాంధీబొమ్మ సెంటర్ నుంచి శనివారం ఎన్నికల ప్రచారాన్ని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప నిర్వహించారు. పలువురు పారిశ్రామికవేత్తల కుటుంబసభ్యులను ఆయన కలిసి రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి సహకరించాలని కోరారు.

జ్యోతుల నవీన్ ప్రచారం

జగ్గంపేట, మార్చి 9: జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలో జ్యోతుల నెహ్రూ, నారా చంద్రబాబుల విజయానికి కృషి చేయాలని జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్, టీడీపీ నేతలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

బెల్లపు ఊట ధ్వంసం

తొండంగి, మార్చి 9: మండలంలోని కొత్త ముసలయ్యపేటలో ఎస్ఈబీ పోలీసు, డీటీఎఫ్ టీము ఆధ్వర్యంలో దాడి చేసి 3400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్ఈబీ ఇన్‌చార్జి ఎస్ హెచ్‌వో పి.చిట్టిబాబు తెలిపారు.

తాటాకిల్లు దగ్ధం

కోటనందూరు, మార్చి 9: తుని-నర్సీపట్నం రహదారిపై కోటనందూరు పోలీస్ స్టేషన్ సమీపంలో కొరుప్రోలు రాజుబాబు తాటాకిల్లు దగ్ధమైంది. సుమారు 1.5లక్షల ఆస్తినష్టం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పారు.



సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: భీమా, గామి, ప్రేమలు, వి లవ్ బ్యాడ్‌బాయ్స్, హనుమాన్

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: భీమా, గామి, ప్రేమలు, బుల్లెట్ గయ్, ఆపరేష్ వాలైంటెన్,బాబుసెంటర్ 1, దుని, బుల్లెట్

తిరుమల	:	భీమా
లక్ష్మి	:	భీమా
సీ అండ్‌సీ1	:	గామి
సీ అండ్‌సీ2	:	ప్రేమలు
శ్రీప్రియ	:	గామి
పద్మప్రియ	:	ప్రేమలు
సత్యగౌరి	:	గామి, ప్రేమలు
సూర్య 1	:	గామి
సూర్య 2	:	భీమా

మహిళ ఆత్మహత్యాయత్నం

సామర్లకోట, మార్చి 9: పట్టణ పరిధి కొత్తూరుకు చెందిన ఒక వివాహిత మహిళ కుటుంబ కలహాల కారణంగా జీవితంపై విరక్తి చెంది పొలాల గట్లపై గడ్డిని నిర్మూలించేందుకు ఇంటి ఆవరణలో దాచిఉంచిన గడ్డి మందును తాగి శనివారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి, అనంతరం సర్పవరం సమీపంలో గల ట్రస్ట్ ఆసుపత్రికి తరలించారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసినట్టు తెలిసింది.

'మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి'

పిఠాపురం, మార్చి 9: రోడ్డు ప్రమాదంలో మరణించిన మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ కుటుంబీకులు, దళిత సంఘాల నేతలు శనివారం రాత్రి పిఠాపురం ప్రభుత్వాసుపత్రి వద్ద రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. గొల్లప్రోలు వద్ద జరిగిన ప్రమాదంలో మరణించిన రాయి సూర్యచంద్ర కుటుంబానికి పరిహారం ఇవ్వాలని, కుటుంబాన్ని ఆదుకోవాలని నినాదాలు చేశారు. వారి ఆందోళనతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. తాము ఉదయం నుంచి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఎవ్వరు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు గంటకు పైగా ఆందోళన సాగింది. దళిత సంఘాల నాయకులతో పిఠాపురం సీఐ శ్రీనివాస్ చర్చలు జరిపారు. అనంతరం ఆందోళన విరమించారు. మాలమహాగర్జన వ్యవస్థాపక అధ్యక్షుడు దానం లాజరుబాబు, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు ఖండవిల్లి లోవరాజు, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బీఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు పోలీసుస్టేషన్ వద్ద..

గొల్లప్రోలు: ప్రమాదంలో మృతిచెందిన ఆటో డ్రైవర్ కుటుంబానికి న్యాయం చేయాలని మృతుడి కుటుంబీకులు, దళిత సంఘాల నేతలు గొల్లప్రోలు పోలీసుస్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించారు. పిఠాపురం నుంచి గొల్లప్రోలు వైపు నుంచి వస్తున్న ఆటో ను లారీ అతివేగంగా ఢీకొనడంతో కొత్తపల్లి మండలం ఇసుకపల్లికి చెం దిన రాయి సూర్యచంద్ర మరణించిన సంగతి తెలిసిందే. లారీ డ్రైవర్ అతివేగంగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని, మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనకారులతో గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీ చర్చలు జరిపారు.